క్లుప్తంగా

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం



కళాశాల ఆవరణలో శ్రమదానం నిర్వహిస్తున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమదానం ఎంతో ఆదర్శనీయమని.. విద్యార్థులందరూ శ్రమదానంలో పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శంకరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరం పాతబస్టాండులో ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాల ద్వారా ఎయిడ్/హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం అధికారి వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం కళాజాత బృందాలు అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీడీఎస్ సభ్యులు ఇందిర, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయ నూతన అధ్యక్షుడు, కార్యవర్గం సభ్యులు

జమ్మలమడుగు రూరల్ : ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆర్యవైశ్య నూతన అధ్యక్షుడు మల్లెంకొండు సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం నూతన కమిటీ ఎంపికను ఆలయ ట్రస్టీలు కర్నాటి జనార్దన్, వంకధార నటరాజ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎంపికను నిర్వహించారు. అధ్యక్షుడిగా మల్లెంకొండు సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి మలిపెద్ది వెంగయ్య, కోశాధికారి సన్నితి సుబ్రమణ్యం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు శరణా వెంకటకిషోర్, లక్ష్మీనారాయణ, రాధా మనోహర్,తదితరులు పాల్గొ న్నారు.

చిన్న శేష వాహనంపై వెంకటేశ్వరుడు



పులివెందుల టౌన్: శ్రీవెంకటేశ్వరస్వామి చిన్న శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్టణంలోని శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు వరదరాజస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై ఉంచి బ్రహ్మోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవింద నామస్మరణతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని హంస వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు.

24 నుంచి కాశినాయన ఆరాధనోత్సవాలు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న శివునినల్లె గ్రామానికి ఎదురుగా వెలసిన కాశిరెడ్డి నాయన 22వ ఆరాధనోత్సవాలు ఈనెల 24వ తేదీ నుంచి జరుగనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాల్లో భాగంగా ఈనెల 24న స్వామికి పూజలతోపాటు అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణం జరిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. 25న ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, అర్చనలు వంటి పూజా కార్యాక్రమాలను చేస్తామన్నారు. అనంతరం చెక్కభజన, కోలాటం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరుగుతాయన్నారు. అలానే బండలాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలిగిన వారు తమ ఎడ్లతో బండలాగుడు పోటీల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ వారు తెలియజేశారు.

‘సిద్ధం’ సభకు తరలిన జనం



పులివెందులలో ‘సిద్ధం’ వాహనాలను ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి



ఎర్రగుంట్లలో సిద్ధం సభకు వెళుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే వైఎస్సార్‌సీపీ సిద్ధం బహిరంగ సభకు పులివెందుల నుంచి మొత్తం 30 వార్డుల కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో వార్డులోని ప్రజలతో భారీగా తరలి వెళ్లారు. ఆదివారం ఉదయం రాప్తాడు సిద్ధం సభకు తరలి వెళుతున్న బస్సులను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సిద్ధం సభకు పులివెందుల మున్సిపాలిటీ నుంచి 45 బస్సులలో తరలి వెళ్లారన్నారు. సిద్ధం సభకు తరలి వెళుతున్న జనాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం సభకు వాహనాలలో తరలి వెళ్లారు. నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ రసూల్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, డిష్ వెంకటరెడ్డి, పుష్పనాథరెడ్డి, పీటీసీ విశ్వనాథరెడ్డి, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ఆశయమని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీగాయత్రిలు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం బహిరంగ సభకు వేంపల్లె మండల వ్యాప్తంగా భారీగా ఎత్తున వెస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు దాదాపు వంద వాహనాలలో తరలి వెళ్లారు. రానున్న ఎన్నికలల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని కోరారు.

తొండూరులో..

తొండూరు : అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభకు మండలంలో భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రత్యేక వాహనాలలో తరలి వెళ్లారు. రాష్ట్ర డైరెక్టర్లు రవీంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, మండల పరిశీలకుడు రామమునిరెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి శశికాంత్‌రెడ్డి, ఎంపీటీసీలు శివశంకర్‌రెడ్డి, విజయశంకర్‌లతోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

లింగాలలో..

లింగాల : రాప్తాడు నియోజకవర్గంలో నిర్వహించిన సిద్ధం సభకు ఆదివారం మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్‌సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వెలిదండ్ల గ్రామంలో ఎంపీపీ రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, అన్ని గ్రామాల్లో నాయకులు వైఎస్ జగన్ భారీ బహిరంగ సభకు తండోప తండాలుగా తరలి వెళ్లారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ అభిమానులు తరలివెళ్లారు. మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభకు ఆదివారం మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, మండల ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యుడు హిదాయత్తుల జెండాను ఊపి బస్సులను ప్రారంభించారు.

కమలాపురంలో..

కమలాపురం : అనంతపురం జిల్లాలో జరిగిన సిద్ధం సభకు వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సిద్ధం సభకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేక వాహనాల్లో భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : అనంతపురం జిల్లాలోని రప్తాడులో జరిగే సిద్ధం సభకు పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సారధ్యంలో బయలుదేరారు. జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, వైఎస్సార్‌సీపీ పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపిటీసీ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో వెళ్లారు.



నల్లపురెడ్డిపల్లె నుంచి సభకు తరలి వెళుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వేంపల్లెలో సిద్ధం సభకు వెళ్లే వాహనాలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, మండల కన్వీనర్



లింగాలలో సిద్ధం సభకు తరలివెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



కమలాపురంలో బయలుదేరుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లి–కొత్తపేట సరిహద్దుల్లో వెలసిన గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు. కోరికలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో విందు భోజనాలను చేశారు. ఆలయ ఆవరణలోని సాయిబాబా, వైద్యనాథీశ్వరుడు, అక్కదేవతలు, నవగ్రహాలు, వీరభద్రుడు, ఆంజనేయస్వామిలకు పూజలు నిర్వహించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీసీతారామ, లక్ష్మణ మూలవిరాట్



రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల : మండలంలోని పెర్నపాడు గ్రామంలో శ్రీరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు అట్టహాసంగా ముగిశాయి. గ్రామంలో రూ.1.50 కోట్లతో నూతనంగా రామాలయాన్ని నిర్మించారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజల అనంతరం శ్రీసీతారాముల, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

సింహాద్రిపురం : మండలంలోని లోమడ గ్రామంలో ఆదివారం ఆలయంలో సీతారామ, లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీ పీ నాయకులు పవన్‌చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ



అలంకరణలో శ్రీవేణుగోపాలకృష్ణస్వామి మూలవిరాట్

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో నూతనంగా నిర్మించిన వేణుగోపాలకృష్ణ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమాలు, అనంతరం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, ధ్వజ శిఖర, పూర్ణాహుతి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు సుధకర్ శర్మ నేతృత్వంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చనలు చేశారు. అలాగే ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోయుక్తంగా రుక్మిణీ, సత్యభామసమేత శ్రీవేణుగోపాలకృష్ణ స్వామి కల్యాణం జరిగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, సర్పంచ్ మునేష్, మాజీ సర్పంచ్ రామాంజనేయరెడ్డి, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉత్తమ భవిత

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరావు పేర్కొన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీ సాయి కుటీర్ రోడ్డులోని గౌతమ్ హైస్కూల్‌లో ఆదివారం పాఠశాల 36వ వార్షికోత్సవం నిర్వహించారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. కరస్పాండెంట్ టి.సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని, ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గౌతమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ మునిస్వామి నాయుడు, ఎస్.హర్షప్రియ, ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని 1979–80 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం కడపలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. 44 ఏళ్ల తరువాత ఒకరికొకరు కలుసుకోవడంతో ఆత్మీయంగా పలకరించడంతోపాటు ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్య నేర్పించిన ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. ఇప్పటి నుంచి ప్రతి ఏడాది కలుసుకోవాలని వారు తీర్మానం చేశారు.

వైభవంగా పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ

రాజుపాళెం : మండలంలోని కొట్టాల గ్రామంలో ఆదివారం గ్రామ దేవత పెద్దమ్మ, పోతురాజు స్వాముల విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వేడుకలకు వివిధ గ్రామాల నుంచి బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో రావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

నేటి నుంచి ఆలయంలో వేడుకలు

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లెలో నేటినుంచి మూడు రోజుల పాటు సీతారామ, లక్ష్మణ సమేత నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మూడవ రోజు బుధవారం ఉదయం 9.45 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, ధ్వజ కలశ ప్రతిష్ఠ, పూర్ణాహుతి తదుపరి సీతారాముల కల్యాణం తీర్థ ప్రసాద వినియోగం, రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో పెండ్లిమర్రి మండలం కొత్తగిరియపల్లె కోదండరామయ్య కోలాట బృందంచే కోలాట కార్యక్రమంతో ప్రతిష్ఠ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొను భక్తులకు గ్రామస్తులు మూడు రోజులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

లక్ష్యం, పట్టుదల ఉన్నత శిఖరాలకు సోపానాలు



మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

వల్లూరు : విద్యార్థులకు ఉన్నత లక్ష్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదలలు ఉన్నత శిఖరాలకు సోపానాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆదివారం సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి నేటి ఓటమిని రేపటి విజయానికి నాందిగా భావించి సమాజంలో ఎదురయ్యే సమస్యలను, అవమానాలను పాజిటివ్ దృక్పథంతో ఎదుర్కొని ఉన్నత లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. లక్ష్య సాధనకు కావాల్సిన వ్యక్తిత్వాన్ని, మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న పేదరికం, కష్టాలను గుర్తెరిగి ఉన్నత స్థానం కోసం ప్రయత్నాలు చేయాలన్నారు. విద్యార్థి పేదరికంలో పుట్టడం తప్పు కాదని, పేదరికంతో చనిపోవడం తప్పన్నారు. మన భవిష్యత్తు మన చేతిలో వుందని, ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానం అధిరోహించడానికి పూర్తి స్థాయిలో కృషి చేయాలన్నారు. చదువుతో పాటు సంస్కారం, జ్ఞానంతోపాటు లోక జ్ఞానం, ఆధ్యాత్మిక భావాలు కలిగి వుండాలని దాని ద్వారా నైతిక విలువలు పెంపొందించుకుని ఆదర్శమైన భావితర పౌరులుగా ఎదగాలన్నారు. జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ అమ్మాయిలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి చదువు, సంస్కారం ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతి విద్యార్థిని చదువుకుని భవిష్యత్తులో మహిళా సాధికారత సాధించాలన్నారు. అనంతరం వంట శాలను, వంటకు ఉపయోగించే కూరగాయలు, ఇతర పదార్థాల నాణ్యతను పీవో పరిశీలించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు నజీమున్నీసా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఇసీ దినేష్‌రెడ్డి

వేముల : గ్రామాల్లో నిర్వహించే బండలాగుడు పోటీలు గ్రామీణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని ప్రముఖ వైద్యులు ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. పెర్నపాడులో శ్రీరామాలయ విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

అనంతరం ఈ పోటీలలో నంద్యాల జిల్లాకు చెందిన దర్మవరం సుబ్బారెడ్డి ఎద్దులు 2505 అడుగులు లాగి మొదటి బహుమతి కింద రూ.1.50 లక్షలు, రమణారెడ్డి ఎద్దులు 2338 అడుగులు లాగి రెండవ బహుమతి కింద రూ.1.20 లక్షలు, గుంటూరు జిల్లాకు చెందిన త్రిషష్టురెడ్డి ఎద్దులు 2183 అడుగులు లాగి మూడవ బహుమతి కింద లక్ష రూపాయలు, అనంతపురం జిల్లాకు చెందిన రమేష్ ఎద్దులు 2100 అడుగులు లాగి నాల్గవ బహుమతి కింద రూ.80వేలు, గుంటూరుకు చెందిన త్రిషష్టురెడ్డి ఎద్దులు 1995 అడుగులు 5వ బహుమతి కింద రూ.70వేలు, కడపకు చెందిన శివరామిరెడ్డి ఎద్దులు 1849 అడుగులు లాగి 6వ బహుమతి కింద రూ.60వేలు, ప్రొద్దుటూరుకు చెందిన గురివిరెడ్డి ఎద్దులు 1800 అడుగులు లాగి 7వ బహుమతి కింద రూ.50వేలు, నంద్యాల జిల్లాకు చెందిన నాగయ్య ఎద్దులు 1662 అడుగులు లాగి 8వ బహుమతి కింద రూ.40వేలు, తాడిపత్రికి చెందిన రమేష్ ఎద్దులు 1653 అడుగులు లాగి 9వ బహుమతి కింద రూ.30వేలు, నంద్యాల జిల్లాకు చెందిన ఓబుళరెడ్డి ఎద్దులు 1644 అడుగులు లాగి 10వ బహుమతి కింద రూ.20వేలు, రంగోరిపల్లెకు చెందిన శివలోహిత్‌రెడ్డి ఎద్దులు 1000 అడుగులు లాగి 11వ బహుమతి కింద రూ.15వేల చొప్పున మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి బహుమతులను అందించారు. ఈ పోటీలలో 23 జతల ఎద్దులు పాల్గొనగా.. 11 జతల ఎద్దులకు బహుమతులు ఇవ్వగా.. మిగిలిన 12 జతల ఎద్దులకు కన్సలేషన్ బహుమతులను అందజేశారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రభుత్వ భవనాలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పెద్దపసుపుల-2 సచివాలయం



నిర్మాణం పూర్తి చేసుకున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్ పనులు ఇప్పటికే పూర్తి కాగా రైతు భరోసా కేంద్రం భవనం పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.40 లక్షలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రానికి రూ.21.90 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌కు రూ.17.18 లక్షలు నిధులు మంజూరు చేసింది. గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభానికి సిద్ధం కాగా రైతు భరోసా కేంద్రం తొందర్లోనే పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : నేటి యువత ప్రస్తుత పరిస్థితుల్లో ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఛత్రపతి శివాజీ ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు అంబారపు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కడపలో ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని హిందూ ధార్మిక వేత్తలు, ప్రజలు శోభాయాత్ర నిర్వహించారు. కడప బిల్డప్ సర్కిల్ సమీపంలోని అంభా భవానీ ఆలయ వద్ద నుంచి యాత్ర ప్రారంభమై నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని ఏటా ఫిబ్రవరి 19న నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం ముందస్తు శోభాయాత్రను నిర్వహించామన్నారు. ఈ శోభాయాత్రలో భక్తులతోపాటు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, టీడీపీ కడప ఇన్‌చార్జి మాధవిరెడ్డి, ఛత్రపతి శివాజీ ఐక్యవేదిక చైర్మన్ రవిశంకర్‌రావు, చవన్, సురేష్, ట్రెజరర్ వీరేంద్రరావు, సభ్యులు నాగార్జున, జగదీస్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో క్షయ వ్యాధి నివారణ

ప్రొద్దుటూరు క్రైం : జాగ్రత్తలు తీసుకుంటే క్షయ వ్యాధి నివారించవచ్చని కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లె గ్రామాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఉప్పరపల్లె గ్రామాన్ని టీబీ ముక్త పంచాయతీ కింద ఎంపిక చేయడంతో గ్రామంలో అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి అధికారులు ఆరా తీశారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందిస్తామని సీహెచ్‌ఓ సందీప్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ మున్నా, కల్లూరు ఎంపీహెచ్‌ఎస్ మాధవరెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాలినడకన సీఎస్ఐ చర్చి సందర్శన

కలసపాడు : స్థానిక సగిలేరు ఒడ్డున ఉన్న సీఎస్ఐ చర్చిని నంద్యాల జిల్లా తోడెండ్లపల్లెకు చెందిన భక్తులు ఆదివారం కాలినడకన వచ్చి సందర్శించారు. లెంట్ దినాలను పురస్కరించుకుని చర్చిలో సామూహిక ప్రార్థనలు చేశారు. చర్చి చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవ. సంజయ్ మధుబాబు, రెవ. ఆశిష్‌గాబ్రియేల్‌బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.